తర్వాత అతను ఏడవడం ఆపేసాడు. మిగతా ప్రయాణీకుల్లా అతను నిశ్శబ్దంగా ఉన్నాడు. కొద్ది సేపట్లో చంద్రోదయం అయి, ఆ దృశ్యం ఎంతో అద్భుతంగా కనిపించింది. ఆ విదూషకుడు రాజుతో చెప్పాడు.

"ఇంతటి సౌందర్యం నేను ఎక్కడా చూడలేదు. ఇంతటి ప్రశాంతతని నేను ఎన్నడూ అనుభవించలేదు."

తిరిగి నౌక ఒడ్డుకి చేరుకునే ముందు రాజు మంత్రిని పిలిచి అడిగాడు.

"వాడ్ని సముద్రంలో పడేస్తే ఏడుపు ఆపుతాడని మీకెలా తెలుసు?"

"నా వైవాహిక జీవితం వల్ల రాజా. మా వివాహం అయ్యాక నా భార్యని నేను పోగొట్టుకుంటానేమోననే భయంతో, అసూయతో నేను ఆమె మీద అరుస్తూ, తిడుతూండేవాడిని. ఆమె ఇక అది భరించలేక ఓ రోజు నన్ను వదిలి వెళ్ళిపోయింది. ఆమె లేకుండా జీవించే చేదు అనుభవాన్ని నేను చవి చూసాను. ఇంక నా అనుమానాలతో ఆమెని హింసించనని నేను మాట ఇచ్చాక ఆమె తిరిగి నా దగ్గరకి వచ్చింది. ఇలాగే ఎన్నడూ ఆ విదూషకుడు కూడా సముద్రంలో మునిగి పోతాననే భయాన్ని ఊహల్లో ఉంచుకుని భయపడుతున్నాడని గ్రహించాను. అతని చేత భయాన్ని అనుభవింప చేసి, అతన్ని తిరిగి నౌకలోకి చేర్చాక, ఆ నీళ్ళనించి నౌకలోని కాళ్ళ కింద చెక్క తనని రక్షిస్తుందని అర్థం చేసుకున్నాడు. దాంతో అతనిలోని భయం తగ్గి శాంతి ఏర్పడింది." వివరించాడు మంత్రి.

ఇలా అనుభవించకుండానే భయాన్ని దూరం చేసుకోగల ఓ మంచి మార్గం ఆధ్యాత్మిక జీవనాన్ని గడపడం. అందువల్ల కలిగే వైరాగ్యం భయానికి సరైన విరుగుడు.

## 49. చక్కటి సలహా

ఏసు క్రీస్తు ఓ విందుకు హాజరయ్యాడు. అక్కడ మనుషులంతా ఒకరినొకరు తోసుకుంటూ, పంక్తిలో ముందు స్థలం కోసం పోటీ పడటం గమనించిన క్రీస్తు వారితో చెప్పాడు.

"విందులో మంచి స్థలాన్ని వదిలి ఆఖరి స్థలంలో కూర్చోవాలి. లేకపోతే నీ తర్వాత నీకంటే ముఖ్యమైన అతిథి విందుకు వస్తే అప్పుడు విందు ఇచ్చేవాడు నిన్ను వెనక్కి పంపి, ఆ పెద్దమనిషిని అక్కడ కూర్చోమంటాడు. అందరి ముందు నీకు అవమానం కలిగి బాధపడతావు. ఆఖరున కూర్చున్న నిన్ను చూసి నీ మిత్రుడు 'ఇక్కడ కూర్చున్నావేమిటి? రా' అని నిన్ను అంతకన్నా మంచి స్థలానికి తీసుకెళ్తే, నువ్వు ఆదరింపబడటం అంతా చూస్తారు. నిన్ను నువ్వు గొప్పగా చేసుకుంటే, దేవుడు నిన్ను తక్కువ చేస్తాడు. నిన్ను నువ్వు తక్కువ చేసుకుంటే, దేవుడు నిన్ను గొప్పగా చేస్తాడు."

## 50. జాతకం

ఓ గ్రామంలో ఓ సాధువు ఓ పాడుబడ్డ గుళ్ళో ఉంటూ చాలాకాలంగా సాధన చేస్తున్నాడు. కష్టాల్లో ఉన్నవారు అతని దగ్గరకి వెళ్ళి తమ కష్టాలని తొలగించమని వేడుకునేవారు. ఆ సాధువు వాళ్ళ జాతకాలని పరిశీలించి, ఏం పరిహారం చేస్తే వాళ్ళకా కష్టాలు తొలగుతాయో చెప్పేవాడు. ఒకోసారి ఆ సాధువు భగవంతుడ్ని సలహా కోరితే కలలో అతను ఉపాసించే దైవం కనపడి ఏదైనా సలహాని కూడా సూచించేవాడు.

ఓ సారి ఓ ముత్తయిదువ ఆ సాధువు దగ్గరకి వెళ్ళి వేడుకుంది.

"స్వామీ! నాకు పెళ్ళయి ఇరవై ఏళ్ళయినా ఇంతదాకా సంతాన యోగ్యత లేదు. దయచేసి నాకు సంతానం కలిగే ఉపాయం చెప్పండి."

అతను ఆవిడ జాతకాన్ని పరిశీలించి చూసి చెప్పాడు.

"నీకు ఈ జన్మకి సంతాన భాగ్యం కలిగే యోగ్యత లేదు."

ఆవిడ విచలిత మనస్కురాలై ఏడుస్తూ అడవిలో వెళ్తూంటే ఓ యోగి ఆవిడని చూసి అడిగాడు.

"దేనికలా బాధపడుతున్నావు?"

"నాది గొడ్రాలి బతుకు కాబట్టి ఆత్మహత్య చేసుకోవాలనుకుని వెళ్తున్నాను."

ఆవిడ జరిగింది అతనికి చెప్పింది.